క్లుప్తంగా

పర్యావరణ పరిరక్షణపై అవగాహన సదస్సులు



సమావేశంలో మాట్లాడుతున్న సత్యకుమార్

నిడమర్రు: పర్యావరణ పరిరక్షణపై మానవత సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని అన్నిగ్రామాల్లో అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ మండల చైర్మన్ సంకు సత్యకుమార్ అన్నారు. మానవత మండల కమిటీ సర్వసభ్య సమావేశం ఆదివారం నౌడు వెంకట అచ్యుత రామారావు అధ్యక్షతన క్రొవ్విడి ఉప సర్పంచ్ ధనుకొండ బుజ్జి నివాసంలో నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన జెడ్పీటీసీ కోడే కాశి మానవత సేవలను కొనియాడారు. డిసెంబరులో మెగా వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు అధ్యక్షుడు నౌడు అచ్యుతరామారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ధనుకొండ ఆదిలక్ష్మి శ్రీను, ట్రెజరర్ సంకు శ్రీను, లాలయ్య, కన్నబాబు, చిన్న సత్యనారాయణ, విశ్వనాథరాజు తదితరులున్నారు.

వెలమలు ఐక్యంగా ఉండాలి



నారాయణపురంలో వన సమారాధనలో మాట్లాడుతున్న జెడ్పీచైర్‌పర్సన్ పద్మశ్రీ

ఉంగుటూరు: వెలమలు ఐక్యతగా ఉండాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అన్నారు. పిల్లలను విద్యావంతులుగా చేస్తే అభివృద్ధి చెందవచ్చునని అన్నారు. ఆర్థిక, రాజకీయ, సామాజికంగా అభివృద్ధి చెందాలని కోరారు. నారాయణపురం వెలమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వన సమారాధనలో సంఘ నాయకులు ఘంటా ప్రసాదరావు, బళ్ల త్రిమూర్తులు, తొత్తల గణపతి, సప్పా వీరబాబు, నల్ల ఆనంద్, మరడా సాంబశివరావు, పల్లి ధానయ్య, గేదల జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.ఆహ్లాదకర వాతావరణంలో వన సమారాధన నిర్వహించారు.

గౌడ జాతికి ప్రభాకర్ బహిరంగ క్షమాపణ చెప్పాలి

పెదవేగి: దెందులూరు మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ గౌడ జాతికి బహిరంగ క్షమపణ చెప్పాలని గౌడ సంఘ నేత దంత సురేష్ గౌడ్ డిమాండ్ చేశారు. ఆదివారం పెదవేగిలో ఆయన మాట్లాడుతూ విరంకి లక్ష్మీనారాయణను చింతమనేని ప్రభాకర్ కొట్టాడని స్వయంగా అతనే చెబుతుంటే.. దానికి ఆధారాలు కావాలని కొంత మంది గౌడ కుల సంఘం నాయకులు అడగడం చాలా దుర్మార్గమైన చర్య విమర్శించారు. ఈ చర్యలపై యావత్తు గౌడ జాతి యొక్క ఆత్మగౌరవం తీవ్రంగా దెబ్బతిన్నాయని తెలియజేస్తూ, కచ్చితంగా దెందులూరు మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ బాధితుడు వీరంకి లక్ష్మీనారాయణకు క్షమపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

పేకాట స్థావరంపై దాడి

పెదపాడు: మండలంలోని పాతముప్పర్రు గ్రామంలో ఆదివారం పోలీసులు పేకాట స్థావరం పై దాడి చేశారు. ముందస్తు సమాచారం ఎస్సై తన సిబ్బందితో దాడి చేసి పేకాడుతున్న ఆరుగురు వ్యక్తుల నుండి రూ.2315లు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పెదపాడు ఎస్సై కృష్ణ చల్లా తెలిపారు.

కార్తీక వనసమారాధన

పెదపాడు: కార్తీక వనసమారాధన ఎంతో పవిత్రమైనదని జెడ్పీ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ తెలిపారు. పెదపాడు మండలంలోని వెలమ సామాజిక వర్గ ప్రజలు వనసమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్తీక మాస విశిష్టతను తెలిపారు. కార్యక్రమంలో ఆమెను వెలమ మహిళలు ఆమెను ఘనంగా సత్కరించారు. ఈకార్యక్రమంలో బీసీ సెల్ అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు, వైస్ ఎంపీపీ రెడ్డి స్వర్ణకుమారి, మాజీ సర్పంచ్ దాసరి కనకసింహచలం, గుణుపూరు మహేష్, భాను, తదితరులు పాల్గొన్నారు.

మానవత భవనం నిర్మాణానికి విరాళం

పెదపాడు: అప్పనవీడులోని మానవత భవనంలో ఫర్నిచర్ ఏర్పాటుకు రాష్ట్ర కన్వీనర్ మారుబోయిన కోటేశ్వరరావు రూ.1,11,111 విరాళంగా అందించారు. పెదపాడు మండలంలోని అప్పనవీడులో మానవత కమిటీ నెలవారీ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సదరు నగదును కమిటీ సభ్యులకు అందించారు. ఇటీవల మానవత భవనాన్ని ఈ నెల ప్రారంభోత్సవం చేయనున్న దృష్ట్యా భోజనాల ఏర్పాటుకు కొట్నాని రామచంద్రరావు రూ.5 వేలు విరాళం అందించారు.

నేడు తుమ్మనగూడెంలో 'వై ఏపీ నీడ్స్ జగన్'

దెందులూరు: దెందులూరు చల్లచింతలపూడి శివారు తుమ్మన గూడెంలో సోమవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ దెందులూరు మండలాధ్యక్షుడు కామిరెడ్డి నాని ఆదివారం తెలిపారు. ముందుగా సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తారని, జెడ్పీటీసీ నిట్టాలీలా నవకాంతం హాజరవుతారని వివరించారు.

రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాలి

ఘనంగా రాజ్యాంగ ఆమోద దినోత్సవం



ఉంగుటూరు: గోపినాథపట్నం పంచాయతీ కార్యాలయం వద్ద ప్రమాణం చేస్తున్న ప్రజాప్రతినిధులు

గణపవరం: ఎంతో పవిత్రమైన భారత రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పలువురు అన్నారు. ఆదివారం భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా గణపవరం మండల కేవీపీఎస్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కేవీపీఎస్ మండల కార్యదర్శి చిన్నం నాగేశ్వరరావు మాట్లాడుతూ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం దేశపౌరులకు హక్కులు, బాధ్యతలు ఇచ్చిందని, బడుగు బలహీనవర్గాలకు ఆశాదీపంలా నిలిచిందన్నారు.

రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కు ఘన నివాళి

ఉంగుటూరు: భారత రాజ్యాంగ ఆవిర్భావ దినోత్సవాన్ని గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ విగ్రహాలకు, చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం వల్ల ఫలాలు అన్ని వర్గాలకు అందుతున్నాయని నాయకులు అన్నారు.అనంతరం రాజ్యాంగ పరిరక్షణ కోసం ప్రమాణం చేశారు. ఉంగుటూరు దళితపేట అంబేడ్కర్ విగ్రహం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు, ఎంపీటీసీ సభ్యుడు పెనుగొండ బాలకృష్ణ, వైఎస్సార్ సీపీ వీవర్స్ జిల్లా అధ్యక్షుడు దొంతంశెట్టి సత్యనారాయణ, ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి, మహిళా నాయకురాలు మంద జయలక్ష్మి, ఎంపీటీసీ చాంబర్ మండల అధ్యక్షుడు



ఉంగుటూరు: అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి



నిడమర్రు: క్రొవ్విడిలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

బండారు నాగరాజు, నాయకులు బావన సూరిబాబు, కార్యకర్తలు పాల్గొన్నారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీడీవో కార్యాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో అంబేడ్కర్ చిత్ర పటానికి ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి పూలమాలలు వేశారు. ఎంపీటీసీ సభ్యుడు పెనుగొండ బాలకృష్ణ, బండారు నాగరాజు, పంచాయతీరాజ్ జిల్లా అధ్యక్షుడు పుప్పాల గోపి, సొసైటీ అధ్యక్షుడు పాపారావు బాబ్జి, ఎంపీడీవో కార్యాలయ ఉద్యోగులు పాల్గొన్నారు. నారాయణపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమానికి ప్రిన్సిపాల్ విశ్వేశ్వరరావు అధ్యక్షత వహించారు. నారాయణపురం కళాశాలలో ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. గోపినాథపట్నం పంచాయతీలో నిర్వహించిన కార్యక్రమంలో సర్పంచులు ఛాంబర్ అధ్యక్షుడు సర్పంచి పుత్సకాయల విష్ణుమూర్తి ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. సభ్యులు సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు. నారాయణపురం సచివాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఈవోపీఆర్డీ షంషుద్దీన్, సర్పంచి దిడ్ల అలకానంద, డీఎల్‌పీవో పాల్గొన్నారు.

ఘనంగా రాజ్యాంగ ఆమోద దినోత్సవం

నిడమర్రు: ప్రపంచ దేశాల రాజ్యాంగాలతో పోల్చితే భారత రాజ్యాంగం ఉన్నత విలువలు కలిగి ఉందని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ సంకు సత్యకుమార్ అన్నారు. ఆదివారం క్రొవ్విడిలో మండల వైఎస్సార్ సీపీ శ్రేణుల ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి మండల కన్వీనర్ సంకు సత్యకుమార్ ఆధ్వర్యంలో నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జెడ్పీటీసీ కోడే కాశి, ఎంపీపీ ధనుకొండ ఆదిలక్ష్మి, మండల గ్రామ సచివాలయాల కన్వీనర్ నౌడు అచ్యుతరామారావు, సర్పంచ్ దాసే ఝాన్సీశ్రీను, ఉపసర్పంచ్ ధనుకొండ బుజ్జి, నేతలు ఎండీ షకీల్, గొట్టుముక్కల విశ్వనాథరాజు, బి. కన్నబాబు, ముత్యాల సత్యనారాయణ, బుంగ సారధి, పేపేటి పెద్దబ్బులు తదితరులున్నారు.

వీరలక్ష్మికి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు



వీరలక్ష్మిని సన్మానిస్తున్న ప్రతాపరెడ్డి

గణపవరం: గణపవరం మండలం కాశిపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోషల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న గంటా వీరలక్ష్మికి రాష్ట్రస్థాయిలో ఉత్తమ సోషల్ ఉపాధ్యాయ అవార్డు లభించింది. ఆదివారం విజయవాడలో నిర్వహించిన రాష్ట్ర సోషల్ స్టడీస్ ఉపాధ్యాయ సంఘం సమావేశంలో ఎస్‌సీఈఆర్‌టీ డైరక్టర్ ప్రతాపరెడ్డి చేతులమీదుగా ఆమెను సన్మానించి జ్ఞాపిక అందజేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 13 ఉమ్మడి జిల్లాల నుంచి 13 మంది సోషల్ ఉపాధ్యాయులను ఈ అవార్డుకు ఎంపికచేయగా ఉమ్మడి పశ్చిమగోదావరి నుంచి వీరలక్ష్మి ఎంపికయ్యారు. ఈమెను గణపవరం ఎంఈఓలు పుచ్చలశేషు, జి.బాలయ్య, హెచ్‌ఎం ప్రసాదరావు, పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు. రాష్ట్ర సోషల్ ఉపాధ్యాయుల సంఘం నాయకులు కృష్ణారెడ్డి, సురేష్, మురళీమోహన్ పాల్గొన్నారు.

పౌరులందరికీ సమ న్యాయం రాజ్యాంగ లక్ష్యం

భీమడోలు: దేశ ప్రజలందరికీ సమ న్యాయం అందించాలన్న సంకల్పంతోనే రాజ్యాంగం ఆమోదం లక్ష్యమని భీమడోలు జెడ్పీటీసీ తుమ్మగుంట భవానీ రంగ అన్నారు. భీమడోలు పంచాయతీ కార్యాలయం వద్ద భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం భారత రత్న బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి సర్పంచ్ పాము సునీతామాన్‌సింగ్, జెడ్పీటీసీ తుమ్మగుంట భవానీ రంగలు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు ప్రతిజ్ఞ చేసారు. అనంతరం నిర్వహించిన సమావేశానికి సర్పంచ్ పాము సునీతామాన్‌సింగ్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి, ఈవోఆర్డీ సుందరి, వైద్యాధికారి కె.శ్రీలక్ష్మి, మండల వైసీపీ కన్వీనర్ రావిపాటి సత్యశ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శి ముళ్లగిరి జాన్సన్, మండల వైసీపీ ప్రధాన కార్యదర్శి రామకుర్తి నాగేశ్వరరావు, గ్రామపార్టీల అధ్యక్షుడు మద్దాల అప్పారావు, రామిశెట్టి శ్రీనివాసరావు, గ్రామకార్యదర్శి ఎస్.ఠాగూర్ పాల్గొన్నారు.



భీమడోలులో బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న జెడ్పీటీసీ

భీమడోలు శాఖా గ్రంథాలయంలో

భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం భీమడోలు, పూళ్ల, గుండుగొలను శాఖా గ్రంథాలయాల్లో జాతీయ న్యాయ దినోత్సవాన్ని, సాంఘిక దినోత్సవాలను ఘనంగా నిర్వహించారు. భీమడోలు గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి నల్లజర్ల ఈవోఆర్డీ పి.సింహాద్రి శంకర్, అభివృద్ధి కమిటీ చైర్మన్ తుమ్మల ఉమామహేశ్వరరావు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మండే సుధాకర్, పెద్దలు కడగల సత్యనారాయణ, పసుపులేటి సోమేశ్వరరావు, గ్రంథపాలకులు డీఎస్‌టీ అమర్‌నాథ్, జి.నాగమణి, విద్యార్థులు పాల్గొన్నారు.

శివాలయాల్లో వైభవంగా కార్తీక పౌర్ణమి పూజలు

నిడమర్రు: కార్తీక పౌర్ణమి పూజలు మండలంలోని శివాలయాల్లో ఆదివారం వైభవంగా నిర్వహించారు. బువ్వనపల్లి ఉమా మార్కేండేశ్వరస్వామి ఆలయంలో, మందలపర్రు ఉమా నీలకంఠేశ్వరస్వామి పంచాయతన క్షేత్రంలో ప్రత్యేక దీపోత్సవాలు నిర్వహించారు. భక్తులు కార్తీక పౌర్ణమి నోములు నోచుకుని శివాలయాల్లో కుటుంబ సమేతంగా పూజలు నిర్వహించారు. మందలపర్రు ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయంలో సోమవారం అన్న సమారాధన ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

గోశాలలో భగవద్గీత పారాయణం

ఉంగుటూరు: నాచుగుంట గోశాలలో భగవద్గీత పారాయణం మహిళా భక్తులు నిర్వహించారు. ఆదివారం పౌర్ణమి సందర్భంగా శ్రీకృష్ణ గీతా సమాజం వారితో పారాయణం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. పౌర్ణమి సందర్భంగా శివాలయాలు కిటకిటలాడాయి. మహిళలు భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. ఉంగుటూరు భీమేశ్వరాలయం, నారాయణపురం, చేబ్రోలు, గొల్లగూడెం, కైకరం, బాదంపూడి, బొమ్మిడి, రాచూరు, కంసాలిగుంట శివాలయాలు ఆదివారం సాయంత్రం భక్తులతో నిండిపోయింది.



మందలపర్రులో శివుని విగ్రహం వద్ద దీపోత్సవం

ఎమ్మెల్సీ పాదయాత్రకు జెడ్పీ చైర్‌పర్సన్ సంఘీభావం

పెదపాడు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ధృడ సంకల్పంతో ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు చేస్తున్న పాదయాత్ర కలపర్రుకు చేరింది. రఘురాజు పాదయాత్ర విజయనగరం జిల్లా ఎస్‌కోట మండలం బొడ్డవలస గ్రామం నుంచి తిరుమల తిరుపతి వరకు సుమారు 820 కిలో మీటర్లు మేర 43రోజులు నిర్విరామంగా జరుగుతున్న జయహో జగనన్న చలో తిరుమల యాత్ర కృష్ణా జిల్లాకు చేరుతున్న సందర్భంగా జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ సంఘీభావం తెలిపారు. కలపర్రు టోల్ గేటు నుండి ఆయనతో పాటు జిల్లా సరిహద్దు దాటే వరకు పాదయాత్ర చేశారు. కార్యక్రమంలో బీసీ సెల్ అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు, ఎంపీపీ బత్తుల రత్నకుమారి, విజిలెన్స్ మోనటరింగ్ కమిటీ సభ్యుడు కత్తుల రవి కుమార్, వీరమ్మకుంట సర్పంచ్ మరడాన చంటిబాబు, వట్రపు కోటిరెడ్డి, కొక్కిరపాడు సర్పంచ్ రెడ్డియ్య, వైస్ ఎంపీపీ బత్తుల స్వర్ణకుమారి, వైకుంఠపు ధనంజయ్, గుణుపూరు మహేష్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ రఘురాజు పాదయాత్రకు సంఘీభావం తెలుపుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ

ఆకట్టుకున్న దీపోత్సవం



గాలాయగూడెంలో దీపోత్సవంలో పాల్గొన్న భక్తులు

దెందులూరు: మండలంలోని గాలాయగూడెం గ్రామంలో ఆదివారం అచ్చెమ్మ తల్లి ఆలయంలో అంబటి లక్ష్మణరావు, రత్తమ్మ శ్రీను ఆధ్వర్యంలో కార్తీక దోపోత్సవం చేశారు. 10,116 దీపాలతో శివలింగం ఓంకారం అయ్యప్ప నామాల ఆకారంలో దీపాలతో అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

గీత కార్మికులంతా ఐక్యతను చాటాలి

ఏలూరు (టూటౌన్) : రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో వేర్వేరు పేర్లతో పిలవబడుతున్న గీత కార్మికులంతా ఏకతాటిపైకి వచ్చి తమ ఐక్యతను చాటాలని, అప్పుడే సుస్థిర అభివృద్ధి సాధ్యమవుతుందని బీసీ సంక్షేమ సమితి రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు అన్నారు. స్థానిక వంగాయగూడెం ప్రాంతంలో గౌడ సమాఖ్య ఆధ్వర్యంలో ఏలూరు నియోజక వర్గ స్థాయి కార్తీక వనసమారాధన కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ బీసీల్లో అత్యధిక జనాభా కలిగిన గీత కార్మికులు ఒక్కో జిల్లాలో ఒక్కో పేరుతో పిలవబడుతున్నారని అన్నారు. గీత వృత్తిలోని గౌడ, శెట్టిబలిజ, ఈడిగ, శ్రీశయన, యాత ఈ ఐదు కులాలు ఒక్కటేనని వీరి వృత్తి గీత గీయడం అని గుర్తు చేసారు. గీత వృత్తిదారులంతా విడివిడిగా ఉండటంతో సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో గీత వృత్తిదారులు వెనుకబడి ఉన్నారని అభిప్రాయపడ్డారు. మాజీ మంత్రి పితాని సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్సీలు మేకా శేషుబాబు, అంగర రామ్మోహనరావు మాట్లాడుతూ ప్రాంతీయ విభేదాలను పక్కన బెట్టి అంతా కలిసి కట్టుగా ముందుకు సాగాలన్నారు. సర్దార్ గౌతు లచ్చన్న ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మార్గాని చంద్రకిరణ్, ఎరుకుల సూరిబాబు, వీరంకి పండు, వీరంకి త్రినాథ్, ఉప్పాల జగదీష్ బాబు, చిట్టిబాల్మ రంగారావు, ఎరుకుల సాంబశివరావు, కొనకళ్ల బుల్లియ్య, పెద్ద సంఖ్యలో గౌడ సంఘీలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక పోటీలు, ఆటలు ఎంతగానో ఆకర్షించాయి.



గౌడ సమాఖ్య కార్తీక వనసమారాధనలో మాట్లాడుతున్న కేశన శంకరరావు

ఎన్‌సీసీ క్యాడెట్లకు ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్లు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఎన్‌సీసీ క్యాడెట్లుగా వివిధ రంగాలకు సేవలందించే వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో 3 శాతం రిజర్వేషన్ సౌకర్యం కల్పించారని, వాటిని క్యాడెట్లు సద్వినియోగం చేసుకుని ఉన్నత ఉద్యోగాలు సాధించి సమాజ సేవలో పునరంకితం కావాలని 19 ఆంధ్రా బెటాలియన్ ఎన్‌సీసీ ఇన్‌ఛార్జ్ కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ సమీర్ కర్ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక సీఆర్ఆర్ కళాశాల ఎన్‌సీసీ విభాగం 19 ఆంధ్రా బెటాలియన్ ఆధ్వర్యంలో 76వ ఎన్‌సీసీ దినోత్సవం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ కేఏస్ విష్ణుమోహన్ మాట్లాడుతూ ఆదికవి నన్నయ యూనివర్సిటీ పరిధిలో సీఆర్ఆర్ ఎన్‌సీసీ యూనిట్ మంచి పేరు సాధించి కళాశాలకు గౌరవం తీసుకువచ్చారన్నారు. ప్రిన్స్‌పాల్ కేఏ రామరాజు మాట్లాడుతూ ఎన్‌సీసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని తమ కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్లు వారం రోజులుగా సమాజంలో వృద్ధులకు, అనాథ పిల్లలకు, విభిన్నప్రతిభావంతులకు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించటం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా 22 మంది ఎన్‌సీసీ క్యాడెట్లు, ఇద్దరు ఆర్మీ జవాన్లు రక్తదానం చేశారు. సీఆర్ఆర్ కళాశాల ఎన్‌సీసీ అధికారి లెఫ్టినెంట్ ఎం. నవీన్ కుమార్ పర్యవేక్షణలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సీనియర్ జేసీఓ ఎంపీ డొమినిక్, రెడ్ క్రాస్ బ్రాంచ్ పీఆర్ఓ కేవీ రమణ, డాక్టర్. ఆర్ఎస్ఆర్‌కే వరప్రసాదరావు, సిబ్బంది పాల్గొన్నారు.



రక్తదాన శిబిరాన్ని సందర్శించిన సీఆర్ఆర్ కళాశాల ప్రతినిధులు, ఎన్‌సీసీ అధికారులు

ఎన్‌సీసీతో విద్యార్థి దశలోనే సేవా భావం

ఎన్‌సీసీలో చేరడం ద్వారా విద్యార్థి దశలోనే ప్రతి ఒక్కరికీ సేవాభావం అలవడుతుందని, పెద్దల పట్ల గౌరవభావం పెరుగుతుందని సీఆర్ఆర్ పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ ఎస్.రాజకళా శ్రీధరి తెలిపారు. ఎన్‌సీసీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నగరంలోని సీఆర్ఆర్ పబ్లిక్ స్కూల్ ఎన్‌సీసీ క్యాడెట్లు ఆదివారం సేవా కార్యక్రమం నిర్వహించారు. తొలుత స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు సాయికుమారి శంకర్ ఎన్‌సీసీ క్యాడెట్ల గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం నగరంలోని ప్రేమాలయం వృద్ధుల ఆశ్రమంలో వృద్ధులకు పండ్లు, ఫలహారాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్కూల్ కరస్పాండెంట్ వీ.రఘుకుమార్ ఎన్‌సీసీ క్యాడెట్లను, ఎన్‌సీసీ సెకండ్ ఆఫీసర్ ఎస్.అనంత, వీ.రమణను ప్రత్యేకంగా అభినందించారు.

ఎస్సీ కమిషన్ చైర్మన్ ఆదేశాల అమలుకు కృషి



కొవ్వలిలో మాట్లాడుతున్న ఏలూరు ఆర్డీఓ ఖాజావలి

దెందులూరు: రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్ అలుగుల గూడెంలో పర్యటించి గ్రామస్తుల కోరిక మేరకు ఇచ్చిన హామీల అమలుకు చర్యలు తీసుకుంటున్నామని ఏలూరు ఆర్డీఓ ఖాజా వలి అన్నారు. ఆదివారం కొవ్వలి వీఆర్వో కార్యాలయంలో దెందులూరు తహసీల్దార్ నాంచారయ్య, వైఎస్సార్ సీపీ జిల్లా కమిటీ సభ్యుడు పోకల రాంబాబు, దెందులూరు కోపరేటివ్ సొసైటీ చైర్మన్ కొలుసు గణపతిరావుతో సమీక్షించారు. అలుగులగూడెంలో సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

ప్రత్యేక హోదా హామీని విస్మరించిన ప్రధాని మోదీ



పాత బస్టాండ్ సెంటర్‌లో అంబేడ్కర్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

ఏలూరు (టూటౌన్): తిరుపతి వెంకన్న సాక్షిగా రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇస్తామని 2014లో హామీ ఇచ్చి మోసం చేసిన ప్రధాని నరేంద్ర మోదీ తిరుపతి పర్యటనను నిరసిస్తూ మోదీ గోబ్యాక్ అంటూ సీపీఎం, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ, సీపీఐ పార్టీల ఆధ్వర్యంలో స్థానిక పాతబస్టాండ్ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట ఆదివారం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి, న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు బద్దా వెంకట్రావు, సీపీఐ నాయకులు పోటేలు పెంటయ్య మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు బి.సోమయ్య, ఆర్ లింగరాజు,కె.శ్రీనివాస్, వి.సాయిబాబు, బి.జగన్నాథరావు, న్యూడెమోక్రసీ నాయకులు యర్రా శ్రీనివాసరావు, కేవీ వెంకటరత్నం, కాకానాని పాల్గొన్నారు.

ముగిసిన క్రీడాపోటీలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక సీఆర్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈ నెల 24వ తేదీ నుంచి ప్రారంభమైన జేఎన్‌టీయూకే అంతర్ కళాశాలల క్రీడా పోటీలు, విశ్వవిద్యాలయ జట్ల ఎంపిక ప్రక్రియ ఆదివారంతో ముగిసింది. 24వ తేదీ నుంచి జేఎన్‌టీయూ కాకినాడ పరిధిలోని వివిధ ఇంజనీరింగ్ కళాశాలల నుంచి పలు క్రీడలకు సంబంధించిన జట్లు ఈ పోటీల్లో ఉత్సాహంగా తలపడ్డాయి. ఆయా క్రీడల పోటీలు శనివారం ముగియగా విజేతలకు ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో బహుమతులు ప్రదానం చేశారు. బహుమతి ప్రదాన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జేఎన్‌టీయూకే ఇంటర్ కాలేజియేట్ కార్యదర్శి జీపీ రాజు, విశిష్ట అతిథిగా జేఎన్‌టీయూకే క్రీడాధికారి జీ. శ్యామ్‌కుమార్ పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ పోటీల్లో విశేష ప్రతిభ కనపరిచిన క్రీడాకారులను త్వరలో నిర్వహించనున్న దక్షిణ భారతస్థాయి అంతర్ విశ్వవిద్యాలయాల పోటీల్లో పాల్గొనే జేఎన్‌టీయూకే జట్లకు ఎంపిక చేశామన్నారు. ఈ సందర్భంగా సీఆర్ఆర్ విద్యా సంస్థల ఇన్‌ఛార్జ్ కార్యదర్శి కిలారు ప్రభాకరరావు మాట్లాడుతూ ఈ పోటీల్లో పాల్గొనడానికి సుమారు 1,100 మంది క్రీడాకారులు తమ కళాశాలకు వచ్చి ఎంతో ఉత్సాహ వాతావరణంలో పోటీల్లో పాల్గొన్నారన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల డిజిగ్నేటెడ్ రిప్రజంటేటివ్ కే. హరి రామకృష్ణంరాజు, ఫిజికల్ డైరెక్టర్ కొమ్మన సంజీవ రావు, అసిస్టెంట్ ఫిజికల్ డైరెక్టర్ షేక్ నసీమా తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా భవానమ్మ జాతర

భీమడోలు: పూళ్ల, ఎంఎంపురం గ్రామాల ప్రజల ఇలవేల్పు శ్రీభవానమ్మ పంట జాతర అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. ఈనెల 19న ఆలయం నుంచి అమ్మవారిని ఉత్సవ మూర్తిని మేళా తాళాలతో తీసుకుని వచ్చి తాటాకులతో ప్రత్యేకంగా నిర్మించిన మేడల్లో కొలువుదీర్చారు. అక్కడ విశేష పూజలు చేసారు. వచ్చే నెలలో 2న అమ్మవారి ఊరడి, 3న అమ్మవారికి సాగనంపే కార్యక్రమం నిర్వహించారు. జాతర కమిటీ ఆధ్వర్యంలో ప్రతి రోజు అమ్మవారిని భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి నైవేద్యాలను అందించారు. మేళ తాళాల నడుమ అమ్మవారి ఘటాలను నెత్తిన పెట్టుకుని ఇంటింటికీ వెళ్లి గ్రామోత్సవాన్ని నిర్వహించారు. భక్తులు పూజలు చేసి పసుపు నీళ్ల పోసి పెరుగన్నం నైవేద్యాలను సమర్పించారు. ఏటా పూళ్ల, ఎంఎంపురం గ్రామాల ప్రజలు సుభిక్షంగా ఉండాలని కోరుతూ, లోక కల్యాణార్థం అమ్మవారికి పంట జాతర చేయడం సంప్రదాయబద్ధంగా వస్తుంది. అమ్మవారిని దర్శించుకునేందుకు ఆదివారం భక్తులు బారులు తీరారు. దీనితో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. ప్రతి రోజు ఆలయం వద్ద భజన కార్యక్రమాలను నిర్వహించారు.

నలుగురు జూదరుల అరెస్టు

ఏలూరు (టూటౌన్): ఏలూరు రూరల్ మండలం కోమటి లంక గ్రామ శివారులోని కొల్లేరులో పేకాట ఆడుతున్న నలుగురిని ఏలూరు రూరల్ పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి రూ.24 వేలు నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై రాజారెడ్డి తెలిపారు.పేకాట శిబిరం నిర్వాహకులు కైకలూరుకు చెందిన చక్రి, దుర్గారావులపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలియజేసారు.